క్లుప్తంగా

నర్వలో 28న ప్రజావాణి

నర్వ: ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 28న నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తమ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నేరుగా హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. వారం రోజులుగా వినతులు స్వీకరించారని, ఈ వారం కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన అన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెడ్పీ నిధులు మంజూరు

మరికల్: మండలంలోని కన్మనూర్, జిన్నారం గ్రామాల అభివృద్ధి పనుల నిమిత్తం జెడ్పీ నిధుల కింద వైస్ చైర్ పర్సన్ సురేఖ రూ. 10 లక్షలను అందజేశారు. సోమవారం కన్మనూర్‌లో జరిగిన రైతు వేదిక ప్రారంభోత్సవంలో రెండు గ్రామాల సర్పంచ్‌లకు చెరో రూ. 5 లక్షల చొప్పున ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో ప్రొసీడింగ్‌లను అందజేయించారు. సర్పంచ్ శరత్‌చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ గోపాల్ ప్రారంభించారు. గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఊట్కూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి కోరారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు అశోక్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ స్వాతి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచాలని వినతి

నారాయణపేట రూరల్ : మోడల్ స్కూల్ హాస్టల్‌లో విధులు నిర్వహించే సిబ్బంది వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ.. సిబ్బందికి వేతనాలు పెంచి బకాయి జీతాలు చెల్లించాలన్నారు. రామాంజనేయులు, సునీత, లలిత, మాధవి, కురుమమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

నారాయణపేట రూరల్ : రైతులు మరింత నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కిసాన్‌మోర్చా కార్యదర్శి గోవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపిస్తోందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ధాన్యం తడిసిపోయిందని విమర్శించారు. తడిసిన బియ్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రూ.50వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్, నర్సింహులు, మోహన్ పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

దామరగిద్ద: డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మండల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హన్మంతు, గోపాల్‌రెడ్డి, జగదీష్, వెంకటరమణ, సాయప్ప అన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయంలో మండల డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 27 న మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేయనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు జగదీష్, వెంకటరమణ, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆవిర్భావ దినోత్సవం

నర్వ: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం మక్తల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాగనూర్: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని నల్లగట్టు మారెమ్మ సర్కిల్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం జరగనుందని పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మక్తల్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం పట్టణంలో మంగళవారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

కృష్ణా: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే బీఆర్‌ఎస్ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని మండల అధ్యక్షుడు విజప్పగౌడ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకులతో మాట్లాడారు.

పాలిటెక్నిక్ డిప్లొమాకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట రూరల్ : దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ మండలిలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు చదువుకునేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. డీఈసీ, డీఈఈఈ, డీసీఎంఈ, డీఈసీఈ విభాగాల్లో 60చొప్పున సీట్లు ఉన్నాయని, జిల్లాలోని అనాథ పిల్లలు, నిరాశ్రయులు, చిల్డ్రన్‌హోంలో ఉండేవారు, దివ్యాంగులు అక్రమ రవాణాకు గురైన వారు అర్హులని తెలిపారు. కుల, ఆదాయ, తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు ఎస్‌ఎస్‌సీ హాల్‌టికెట్, బోనఫైడ్, టీసీతో మే 8లోపు జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు..

నారాయణపేట రూరల్ : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో 1వ తరగతి చదివేందుకు గిరిజన బాల, బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2017 సంవత్సరంలో జనవరి 1 నుంచి డిసెంబర్ 31 మధ్య కాలంలో జన్మించిన వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలకు మించి ఉండరాదన్నారు. ఈ నెల 29లోపు మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో దరఖాస్తు చేసుకోవాలని, మే 3న లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు.

సాగులో మార్పు అవసరం


బీరప్ప ఉత్సవాల్లోపాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మరికల్: పంటలు సాగు చేసే విధానంలో మార్పు వస్తే దిగుబడి పెరిగి లాభాలు వస్తాయని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కన్మనూర్‌లో మన ఊరు మన బడి పనుల్లో ముస్తాబైన ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలతో పాటు, రైతు వేదికను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. అదే విధంగా రైతుల కోసం నియోజకవర్గంలో 48 రైతు వేదికలను నిర్మించినట్లు వివరించారు. రైతులు సాగు సమయంలో అధికారులను సంప్రదించి భూసార పరీక్షలను నిర్వహించి అవసరమైన మార్పులు చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులను సాధ్యమైనంత మేరకు తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే ఆరోగ్య పరమైన జీవితం చూడవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ సురేఖ, సర్పంచ్ శరత్‌చంద్రారెడ్డి, ఏఓ శివకుమార్, ఏఈఓ అనిత, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సంపత్, రాజవర్ధన్‌రెడ్డి, హన్మిరెడ్డి, చింతలయ్య, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో జరుగుతున్న బీరప్ప బండారు ఉత్సవాలలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గొల్ల కురుమల ఆరాధ్య దైవం బీరప్ప అని అన్నారు. ఆయన ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. సందర్భంగా కురువ సంఘం పెద్దలు ఎమ్మెల్యేను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ తిమ్మప్ప, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మల్‌రెడ్డి, దేవరాజ్, వాకిటి శ్రీనివాసులు, రాజాక్ పాల్గొన్నారు.

మక్తల్: ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి గుడిగండ్లలో పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఈఓ లియాఖత్‌అలీ, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ లక్ష్మి, ఎంపీఓ పావనీ, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: రైతును రాజును చేయడమే కేసీఆర్ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటలను సాగు చేసేందుకు రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీటిని విడుదల చేయడంతో రైతులకు ఎంతో మేలు జరిగిందని అన్నారు. ఎంపిటీసీ ఎల్లారెడ్డి, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మాగనూర్: ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరుకావాల్సి ఉండగా పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ పనుల కారణంగా రాలేకపోయారు. దీంతో దాదాపుగా 40 నిమిషాలు ఆలస్యంగా సభ మొదలైంది. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వ్యవసాయ అధికారి హరిత మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 33 మంది రైతులు మరణిస్తే అందులో 30 మంది కుటుంబాలకు రైతు బీమాను ప్రభుత్వం ద్వారా అందజేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల డైరీని సభ ఆధ్వర్యంలో విడుదల చేశారు.


సమావేశంలో డైరీలను ఆవిష్కరిస్తున్న అధికారులు

అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూల తిప్పయ్య, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, కోఆప్షన్‌మెంబర్ యాకూబ్ అలీ, ఎంపీఓ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుకింగ్ ఒక చోటుకి.. డంపింగ్ మరోచోటుకి

మద్దూరు: మన ఇసుక మన వాహనంలో ఓ లబ్ధిదారుడు ఇసుక బుకింగ్ ఒక చోటుకు చేసుకుని మరో చోట డంపింగ్ చేయిస్తుండగా వీఆర్‌ఏలు పట్టుకున్న ఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లి దగ్గర సోమవారం చోటు చేసుకుంది. వీఆర్‌ఏల కథనం మేరకు లింగల్ చేడ్ వాగు నుంచి నాగంపల్లికి ఇసుకను ఆన్‌లైన్‌లో ఓ లబ్ధిదారుడు బుక్ చేసుకున్నారు. కానీ బుక్ చేసుకున్న లొకేషన్‌కు కాకుండా నాగిరెడ్డిపల్లిలో ఇసుక డంపింగ్ చేయాలని ట్రాక్టర్ యజమానులను కోరాడు. అయితే ఇలా చేయడం వల్ల తాము నష్టపోతామని వారు నిరాకరించారు. దీంతో విషయం తెలుసుకున్న వీఆర్‌ఏలు అక్కడకు చేరుకుని విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా బుకింగ్ సమయంలో నాగంపల్లికి అయితే ఒక ట్రాక్టర్ ఇసుక ఆన్‌లైన్‌లో రూ. 3220 కట్టాల్సి ఉంది. అదే నాగిరెడ్డిపల్లి అయితే రూ.3720 కట్టాల్సి ఉంటుంది. దాదాపు రూ. 500 ఎక్కువ కట్టాల్సి వస్తుందన్న ఉద్దేశంతో లబ్ధిదారుడు ఒక చోటుకి బుక్ చేసి మరో చోట డంపింగ్ చేయించుకోవడానికి ప్రయత్నించాడు. విషయంపై కొత్తపల్లి తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్‌ను వివరణ కోరగా ఇలాంటి నేరాలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

సెక్టోరియల్ అధికారుల ఎంపిక

నారాయణపేట రూరల్ : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో పాఠశాలల పర్యవేక్షణ, నిర్వహణ నిమిత్తం సెక్టోరియల్ అధికారుల నియామకం నిర్వహించారు. ప్రతి 3 నుంచి 5సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పరీక్ష 2019లో చేపట్టారు. ఎస్‌ఓ–2(ఏఎంఓ)గా విద్యాసాగర్, ఎస్‌ఓ–3 (జీసీడీఓ)గా జీహెచ్‌ఎం పద్మనళిని ఎంపికయ్యారు. ఎస్‌ఓ–1, ఎస్‌ఓ–4 ఖాళీగా ఉండటంతో ఆ స్థానాల్లో మక్తల్ హైస్కూల్ హెచ్‌పీటీ శ్రీనివాస్, నారాయణపేట గ్రౌండ్ స్కూల్ ఫిజిక్స్ టీచర్ శ్రీనివాస్‌లు తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఈ ఏడాది జనవరి 8న తిరిగి మరోసారి సెక్టోరియల్ అధికారుల నియామకానికి పరీక్షలు నిర్వహించారు. కాగా ఎస్‌ఓ – 1 (ప్లానింగ్, డైస్)కు ముగ్గురు క్వాలిఫై అయ్యారు. వీరిలో బొమ్మన్‌పాడు స్కూల్ హెచ్‌ఎం నాగార్జున్‌రెడ్డి ఎంపికయ్యారు. అదేవిధంగా ఎస్‌ఓ – 4 (సీఎంఓ)నలుగురు క్వాలిఫై కాగా వారిలో జాజాపూర్ హైస్కూల్ జీహెచ్‌ఎం రాజేంద్రకుమార్ ఎంపికయ్యారు. వీరిద్దరి నుంచి సోమవారం విల్లింగ్ లెటర్లను డీఈఓ లియాకత్‌అలీ తీసుకుని హైదరాబాద్ కార్యాలయానికి పంపించారు. మరో నాలుగు రోజుల్లో ఎస్‌ఓల నియామకాలపై అధికారిక ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. వారు విధుల్లో చేరితే తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న వారు తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. లేదా కార్యాలయంలో వేరే విభాగాల పర్యవేక్షణ పేరుతో ఇక్కడే కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఇప్పటి వరకు అసిస్టెంట్ స్టాటిస్టికల్ కో ఆర్డినేటర్ (ఏఎస్‌ఓ)గా గతంలో ఎంపికైన వెంకటనారాయణ రంగారెడ్డికి బదిలీపై వెళ్లడంతో అది ఖాళీగా ఉంది. ఈసారి నిర్వహించిన పరీక్షలో సైతం ఇద్దరు హాజరైనా వారు క్వాలిఫై కాలేదు.

కళ్లకు గంతలు కట్టుకుని సమ్మె


కళ్లకు గంతలు కట్టుకుని సమ్మెలో పాల్గొన్న వీఓఏలు

మక్తల్: పట్టణంలో వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం పనిచేసే వారికి జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉందని విమర్శించారు. వీఓఏలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు బాల్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి నాగప్ప, జ్యోతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలో వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం వీఓఏలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు పూంజనూర్ బాబు మాట్లాడుతూ.. తమకు న్యాయం చేసేవరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి విష్ణు, కోశాధికారి రఘు, మారుతి, వరలక్ష్మి, మహేశ్వరమ్మ, రవి, వెంకటమ్మ, భాగ్యమ్మ, పావని, కరెప్ప, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మక్తల్: పట్టణంలో సత్యసాయి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ఎస్‌ఐ పర్వతాలు సోమవారం ప్రారంభించారు. ప్రజలకు దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ శుభోదయ రాములు, భాస్కర్, చంద్రకాంత్‌గౌడ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

30న శిబిరం

నారాయణపేట టౌన్ : గీతా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు డాక్టర్ గీతా విశ్వనాథ్ సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ లలిత, సోని, నర్మద, శాంత పాల్గొన్నారు.

విద్యార్థులకు పాదరక్షల పంపిణీ



కోస్గి: మండల పరిధిలోని సర్జఖాన్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం పేద విద్యార్థులకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉచితంగా పాదరక్షలు పంపిణీ చేశారు. సర్జఖాన్‌పేట బ్రాంచ్ మేనేజర్ అనురాగ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా బ్యాంక్‌ను సందర్శించారు. అప్పట్లో వారు పాదరక్షలు లేకుండా రావడం గమనించిన మేనేజర్ 60 మందికి సోమవారం పాదరక్షలు అందజేశారు. ఇదే క్రమంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థికి రూ. 10 వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సర్పంచ్ హరీష్ గౌడ్‌తోపాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పాత విధానం అమలు చేయాలి

దామరగిద్ద: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రాజశేఖర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఇటీవల ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్ తదితర చోట్ల పాత విధానం అమలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణలోనూ అమలు చేయాలని ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు.

పాడి రైతులు అభివృద్ధి చెందాలి

మక్తల్: పాడి రైతులు అభివృద్ధి చెందాలని నాబార్డు డీడీఎం అఖిల్ అన్నారు. సోమవారం పట్టణంలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పాడి రైతు సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సీఈఓ చాంద్‌సుల్తానా, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, మఠం రాధిదక, కుర్మయ్య, ఏడీ మియాజ్ హైమద్, దివాకర్, వనజ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

ధన్వాడ: కిష్టాపూర్‌లోని ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రి గుడిసె నిర్మించిన ఘటనపై వార్త సాక్షిలో ప్రచురణ అయిన నేపథ్యంలో అనుమతి లేకుండా గుడిసెలు వేశారంటూ పంచాయతీ కార్యదర్శి నిర్మల సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. 142 సర్వే నంబర్ ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్‌ఐ రమేష్‌కు వివరణ కోరగా ఫిర్యాదు అందిందన్నారు. ఈ విషయంపై సర్వేయర్‌ను సంప్రదించగా సర్వే ఇంకా పూర్తిస్థాయిలో కాలేదని పూర్తి అయిన తరువాత సమాచారం అందిస్తామని చెప్పారన్నారు.

నేడు పాలిసెట్ మాదిరి పరీక్ష

నారాయణపేట రూరల్ : నీడ సంస్థ ఆధ్వర్యంలో టెన్త్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం పాలిసెట్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కన్వీనర్ రమేష్‌శెట్టి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధన్వాడ మండల కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ స్కూల్ టెస్ట్ ఉంటుందన్నారు. పరీక్ష ఆధారంగా 15 రోజులు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం సరికాదు

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి చెప్పడం సరికాదని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న 4శాతం రిజర్వేషన్లు ముస్లిం రిజర్వేషన్లు కావని, అవి ముస్లింలలో వెనుకబడిన 12ఉపకులాలకు సంబంధించిన రిజర్వేషన్లని పేర్కొన్నారు. వీటిని అమలు చేయడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన కృషి అందుకు నిదర్శనమని తెలిపారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు మానుకొని సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కేవలం మాటల్లో కాకుండా చేతల్లో అమలుపరిచి చూపాలని కోరారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం


బహుమతులతో క్రీడాకారులు

మక్తల్: జాతీయ స్కిప్పింగ్ డే సందర్భంగా జిల్లా షూటింగ్ బాల్, సైక్లింగ్, టగ్గాఫ్‌వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ మేరకు సోమవారం విజేతలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోడియం వితరణ

మాగనూర్: మండలంలోని నేరడగం పంచమ సిద్ధలింగ మహాస్వామి మఠానికి మక్తల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ వారు రూ. 10 వేలు విలువ చేసే పోడియంను వితరణ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు బి. గోపాలం, బి. భాస్కర్, యూనియన్ నాయకులు సూర్యప్రకాష్, సిద్ధిలింగయ్య, కిష్టయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ఊట్కూరు: ఇంటింటికీ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి కోరారు. సోమవారం ఊట్కూరులోని బుడగజంగం కాలనీలో సామూహిక ఇంకుడుగుంత నిర్మాణ పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాలప్ప, పీఆర్ ఏఈ జగత్‌చంద్ర, కార్యదర్శి సుమలత, ఈసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిశీలన

ఊట్కూరు: హరితహారంలో భాగంగా ఊట్కూర్‌లో పెంచుతున్న మొక్కలను సోమవారం ఎంపీడీఓ కాలప్ప పరిశీలించారు. మక్తల్, నారాయణపేట రోడ్డుకు ఇరువైపులా పెంచుతున్న మొక్కలను పరిశీలించి కూలీలకు సూచనలు చేశారు. మొక్కలు ఎండిపోకుండా నీరు పోయాలని పాదులు తవ్వి ట్రీగార్డులను ఏర్పాటు చేయాలని అన్నారు.

అగ్నివీరులకు ఉచిత శిక్షణ

నారాయణపేట రూరల్ : వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీలలో ఉద్యోగాలు పొందాలనుకునే వారికి ఫిజికల్ శిక్షణను ఉచితంగా అందిస్తున్నట్లు డైరెక్టర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. మే 1 నుంచి ప్రారంభమయ్యే కోచింగ్‌లో శిక్షణ ఇస్తామని, దీనికి ఎలాంటి డబ్బులు కట్టాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలోని యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9086271418ను సంప్రదించాలన్నారు.

సత్యసాయి ఆరాధన మహోత్సవం

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలో భగవాన్ పుట్టపర్తి సాయిబాబా 12వ ఆరాధన మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు నిర్వహించారు. భక్తి సంకీర్తనలు, భజనలు చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారీ మాట్లాడుతూ.. బాబా చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, మల్లికార్జున్, శివరాజ్, ప్రసాద్‌రెడ్డి, గోపీనాథ్, బీవీఎస్‌రెడ్డి, ఆనంద్‌వారీ, రామకృష్ణ, మోహన్, విజయ్‌కుమార్, అన్నపూర్ణ, బానుమతి, మాధవి, కుసుమకుమారి పాల్గొన్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మక్తల్: పారేవుల మందిరంలో భగవాన్ సత్యసాయి బాబా 12 వ ఆరాధన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సత్యసాయి తాగునీటి సిబ్బందిని శాలువతో సన్మానించారు. సేవా సమితి జిల్లా కన్వీనర్ చిట్టెం మాధవరెడ్డి, గోపీనాథ్, మల్లికార్జున్, మోహన్, శివరాజ్, సురేష్, బసంత్, గోవర్ధన్, అనంతయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను పర్మినెంట్ చేయాలి


ఉత్తరాలు పోస్టు చేస్తున్న కార్యదర్శులు

మక్తల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉత్తరాలు పంపారు. అనంతరం 28 నుంచి సమ్మెకు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్‌ఐ పర్వతాలుకు వినతి అందజేశారు. తమకు సహకరించాలని కోరారు. అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మూర్తి, మౌనిక, అనిత, జ్యోతి, శ్రీనివాసులు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం స్థానిక పోస్టఫీస్ నుంచి సీఎం కేసీఆర్‌కు ఉత్తరం పంపించారు. రాజు, కిశోర్, రవికుమార్, నర్సప్ప, ఆనంద్, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కార్యదర్శులు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రాజేష్, నాగిరెడ్డి ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. తాము చేపట్టే నిరవధిక సమ్మెకు పోలీసులు అనుమతించాలని కోరుతూ ఏఎస్‌ఐ అబ్దుల్‌కు వినతిపత్రం అందించారు. కార్యదర్శులు సుమలత, రాజునారాయణ, సబిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్ : విద్యా సంవత్సరం విజయవంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 512 పాఠశాలల్లో 55,115మంది విద్యార్థులు ఈ ఏడాది విద్యను అభ్యసించారు. టెన్త్ పరీక్షలు ఈ నెల 3న ముగిసిన వెంటనే 4 నుంచి ఎస్‌ఏ – 2 పరీక్షలను డీసీఈబీ ద్వారా నిర్వహించారు. అటు వెంటనే పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లో మార్కులను నమోదు చేసి గ్రేడుల ద్వారా ఫలితాలను సోమవారం అందించారు. 2022 – 23 విద్యా సంవత్సరం జూన్‌లో ప్రారంభమై సిలబస్ పూర్తి చేయడంతో నాలుగు ఎఫ్‌ఏలు, రెండు ఎస్‌ఏ పరీక్షలను నిర్వహించారు. ప్రాథమిక తరగతులకు ప్రత్యేకంగా ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతి పత్రాలను అందజేశారు.

మక్తల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్ విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైందని అన్నారు. వారిపై ప్రత్యేకగా శ్రద్ధ చూపాలన్నారు.కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, అరుణ, విద్యా కమిటీ చైర్మన్ భీమప్ప, గోపాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు వేసవి సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అన్నారు. సోమవారం పాఠశాలలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభం మవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి పత్రాలను అందజేశారు. అనంతరం ఈ విద్యా సంవత్సరం చేపట్టిన పలు అంశాలపై వివరించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ అయ్యన్న, వైస్ చైర్మన్ రాధ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లి పాఠశాలలో ప్రగతి పత్రాలను అందుకున్న విద్యార్థులు

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. హెచ్‌ఎం నిజాముద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊట్కూరు: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. సోమవారం మండలంలోని నిడుగుర్తి, కొత్తపల్లి, మల్లెపల్లి, పులిమామిడి, ఊట్కూరు తదితర పాఠశాలల్లో విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించిన సందర్భంగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మాణిక్యమ్మ, యశోదమ్మ, హెచ్‌ఎంలు లక్ష్మారెడ్డి, నర్సింగప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, శంకరయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

‘కేటీఆర్ రాజీనామా చేయాలి’

కోస్గి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 25న నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంట్ ప్రభారీ చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ఐటీ మంత్రి కేటీఆర్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. అసెంబ్లీ కో కన్వీనర్ కోటకొండ రాము, మండల పార్టీ అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రాములు, జైపాల్, సందీప్, బాల్‌రాజ్, శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు